సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 16, ఏప్రిల్, 2024



చింతపండుకు గిట్టుబాటు ధర

గిరిజన సహకార సంస్థ భారీగా చింతపండు కొనుగోలుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా గిట్టుబాటు ధర ప్రకటించింది. 8లో



ఆకట్టుకున్న విన్యాసాలు

విశాఖ: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జీవీరోడ్డులో సిబ్బంది ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్యకల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఓటు నమోదుకు 10,780 దరఖాస్తులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి 10,780 ఫారం6 దరఖాస్తులను స్వీకరించారు. ఈఏడాది జనవరి 23వతేదీన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఆ తరువాత మళ్లీ కొత్త ఓటర్ల నమోదుకు భారత ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అప్పటినుంచి ఈనెల 14వతేదీ వరకు అరకులోయ నియోజకవర్గంలో 4,114మంది, పాడేరు పరిధిలో 3,714మంది, రంపచోడవరం పరిధిలో 2,953 మంది దరఖాస్తులు అందజేశారు. ఈ దరఖాస్తులన్నింటిని సమగ్రంగా పరిశీలించి ఈనెల 24వతేదీన తుది ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల వివరాలను పొందుపరుస్తామని కలెక్టర్ ఎం.విజయ సునీత పేర్కొన్నారు.

ప్రస్తుత ఓటర్లు : జనవరి 23వతేదీన భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 7,69,098 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో మహిళలు 3,98,928, పురుషులు 3,70,131,ఇతరులు 39 మంది ఉన్నారని అధికారవర్గాలు తెలిపాయి. నియోజకవర్గాల వారీగా అరకులోయలో 2,44,741 మంది, పాడేరులో 2,47,857మంది, రంపచోడవరంలో 2,76,500 మంది ఉన్నారు. దీంతో ఓటర్ల సంఖ్య మరింత పెరగనుంది.

జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా వివేకానందరావు


సాక్షి,పాడేరు: వచ్చేనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా తమిళనాడుకు చెందిన ఐఏఎస్ అధికారి కె.వివేకానందరావును ఎన్నికల కమిషన్ నియమించింది. జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికలను ఆయన పర్యవేక్షిస్తారు. ఈమేరకు ఈనెల 28న ఆయన జిల్లా కేంద్రం పాడేరు రానున్నారు.

ఏవోబీలో హెలికాప్టర్ చక్కర్లు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సోమవారం ఉదయం పలుమార్లు హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. మావోయిస్టుల మూడు రోజుల బంద్ నేపథ్యంలో ఒడిశాకు చెందిన పోలీసులు ఉన్నతాధికారులు సరిహద్దులో పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు. అవుట్ పోస్టులను సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ ఆంధ్రా పరిధి ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లోని రంగబయలు, బుంగాపుట్టు, భూసిపుట్టు, జామిగూడ, గిన్నెలకోట ప్రాంతాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయా ప్రాంతాల గిరిజనులు భయాందోళనకు గురయ్యారు.

విజయమే లక్ష్యం కావాలి


పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : గ్రూప్-2లో విజయమే లక్ష్యంగా మెయిన్స్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షల్లో సత్తా చాటి మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులను ఆయన అభినందించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటీసీలో 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహిస్తున్న సివిల్స్ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. శిక్షణ పొందుతున్న గిరిజన విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని బాగా సాధన చేసి ప్రభుత్వ కొలువు సాధించాలని కోరారు. గ్రూప్-2లో విజయం సాధిస్తే గ్రూప్-1పై నమ్మకం పెరుగుతుందన్నారు. జాగ్రఫీ పాఠ్యాంశాన్ని వారికి బోధించారు. ఎకానమిక్ సర్వే ఆఫ్ ఏపీపై విద్యార్థులకు పీవో అవగాహన కల్పించారు. గ్రూప్-2 మెయిన్స్‌పై వారంతపు పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో ఎల్ రజనీ పాల్గొన్నారు.

రూ.2.18 లక్షల స్వాధీనం



వెంకటేశ్వరమెట్ట వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎన్నికల అధికారులు

తగరపువలస (విశాఖ): వెంకటేశ్వరమెట్ట వద్ద చెక్‌పోస్టులో సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.2,18,000 నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమిలి మండలం కింగసబంధ పంచాయతీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ పరిపాలన విభాగానికి చెందిన భాను అనే వ్యక్తి ఈ నగదు తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఎన్నికల అధికారులు సీజ్ చేశారు.

పకడ్బందీగా.. సజావుగా..

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు సమీపిస్తుండటంతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. మరోపక్క ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుచేస్తూ పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ కూడా పోలింగ్ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేస్తోంది.

- సార్వత్రిక ఎన్నికల నిర్వహణ లక్ష్యం
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు
- 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాట్లు
- గుర్తెడు నుంచి ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపునకు హెలికాప్టర్ వినియోగం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత

సాక్షి ఇంటర్వ్యూ



సాక్షి,పాడేరు: జిల్లాలోని అరకు పార్లమెంట్‌తో పాటు రంపచోడవరం, పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె సాక్షితో మాట్లాడారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలుచేస్తున్నాం. కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల విభాగంతో పాటు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో అన్ని విభాగాల నోడల్ అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు విజయవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీలకు అనుమతులతో పాటు సీ-విజిల్ ఫిర్యాదులపైన క్షణాల్లో స్పందిస్తున్నారు. ఎస్‌డీసీ శర్మ అధ్వర్యంలో స్పెషల్ స్క్వాడ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. నగదు,మద్యం, ఇతర సామగ్రి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసుశాఖ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. అన్ని ప్రధాన రోడ్లు, జంక్షన్లలో వాహనాల తనిఖీలను విస్తృతం చేసింది.

పీవోలు, ఏపీవోలకు సమగ్ర శిక్షణ

సార్వత్రిక ఎన్నికల విధులను నిర్వహించే పోలింగ్ కేంద్రాల పీవోలు, ఏపీవోలకు సమగ్ర శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. జిల్లాలో 2849 మందికి బ్యాచ్‌ల వారీగా అధికారులు శిక్షణ ఇస్తున్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించే లక్ష్యంగా అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఈవీఎంల వినియోగంపైనా ఓటర్లను చైతన్య పరుస్తున్నాం.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

వచ్చేనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 1,021 పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుదీకరణ పనులతో పాటు దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా ర్యాంప్‌ల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నాం. వీల్‌చైర్లకు సంబంధించి అధికారుల నుంచి నివేదికలు కోరాం.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

జిల్లా కేంద్రంలోని ప్రధాన స్ట్రాంగ్ రూం నుంచి నియోజకవర్గ కేంద్రాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలోని స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు, వీవీప్యాట్లు ఇతర సామగ్రిని తరలించాం. ప్రత్యేక పోలీసు బలగాల భద్రతతో రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, అరకులోయలో తహసీల్దార్ కార్యాలయం, పాడేరులో డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటుచేశాం. రాజకీయ పార్టీ నేతల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచి ఆయా గదులకు సీళ్లు వేశాం.


నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు

ఎన్నికల కమిషన్ 18వతేదీన నోటిఫికేషన్ జారీ చేయనుండడంతో అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. అరకు పార్లమెంట్‌కు పార్వతీపురం కలెక్టరేట్‌లోను, రంపచోడవరం అసెంబ్లీకి రంపచోడవరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో, పాడేరు అసెంబ్లీకి పాడేరు కలెక్టరేట్‌లో ,అరకు అసెంబ్లీకి పాడేరు ఐటీడీఏలోను నామినేషన్లు స్వీకరిస్తాం. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆయా ఏర్పాట్లపై సమీక్షిస్తున్నారు.

హెలికాప్టర్ వినియోగంపై నివేదిక

జిల్లాలోని పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చాం. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని గుర్తెడు ప్రాంతంలో ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ అనంతరం ఈవీఎంలు, ఇతర సామగ్రిని స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు హెలికాప్టర్ వినియోగిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నాం. అంతేకాకుండా జిల్లాలో 30 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సమీప ప్రాంతాలకు మార్పు, రంపచోడవరం నియోజకవర్గం ఓట్ల లెక్కింపును రంపచోడవరంలోనే నిర్వహించేలా నివేదించాం.

ఏజెన్సీ భద్రాద్రికి కల్యాణ శోభ



శ్రీరామగిరి కొండపైన సుందర సీతారామచంద్రస్వామివారి ఆలయం

శ్రీరామగిరిలోని శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి ఆలయం కల్యాణోత్సవాలకు ముస్తాబయ్యింది. ఇక్కడికి సమీపంలోని గ్రామాలన్నీ రామాయణంలోని ఘట్టాలతో ముడిపడి ఉన్నందున ఏజెన్సీ భద్రాద్రిగా ఈ ఆలయం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది.

- శ్రీరామగిరిలో 17న స్వామివారి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

వీఆర్‌పురం: శ్రీరామగిరిలో కొండపై కొలువైన శ్రీ సుందరసీతారామస్వామి ఆలయంలో ఈనెల 17న స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చలువ పందిళ్లు వేశారు. హోమ గుండం, కల్యాణ మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు.

విశిష్టత ఇలా..

రామభక్తుడైన మాతంగి మహర్షి 500 ఏళ్లక్రితం ఈ ఆలయాన్ని నిర్మించారు. సీతారామచంద్రస్వామివారి ప్రతిమలను ఆయనే స్వయంగా ప్రతిష్ఠించినట్టు చరిత్ర చెబుతోంది. వనవాసకాలంలో దండకారణ్యంలో దుమ్ముగుడెం అటవీ ప్రాంతంలో సీతాదేవిని రావణాసురుడు అపహరించుకుపోతుండగా జటాయువు అనే పక్షి పోరాడింది. ఆ పక్షికి సంబంధించి ఒక రెక్క భద్రాచలానికి సమీప ఎటపాకలోను మరో రెక్క ప్రస్తుత వీఆర్‌పురం మండలం రేఖపల్లి వద్ద పడిందని అందుకే ఒకప్పటి రెక్క తెగపడింది. అందువల్లే ఈ ప్రదేశం రెక్కపల్లి.. కాలక్రమంలో రేఖపల్లి గా మారిందని స్థానికులు చెబుతుంటారు. జటాయువు మిగిలిన దేహ భాగంతో శ్రీరామగిరికి సమీపంలోని చొక్కనపల్లి ప్రదేశంలో సీతమ్మ జాడ చెప్పేందుకు కొనఊపిరితో ఎదురుచూసింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన రామచంద్రునికి ఈ విషయం చెప్పి ప్రాణం విడిచిందని ఈ ప్రాంతీయులు చెబుతుంటారు.



నవమి ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ రామారావు



ఆలయ మార్గంలో ఏర్పాటుచేసిన చలువ పందిరి

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

శ్రీరామనవమి ఉత్సవాలను వీక్షించేందుకు శ్రీరామగిరికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చూడాలని సీఐ దానేటి రామారావు సిబ్బందిని ఆదేశించారు. శ్రీరామగిరిలోని శ్రీరామనవమి ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. గోదావరి అవతలి మండలం వెలేరుపాడు నుంచి కల్యాణాన్ని తిలకించేందుకు విచ్చేసే భక్తులను గోదావరిలో బోట్‌పై తరలించే బోట్‌పాయింట్‌ను ఆయన పరిశీలించారు. తలంబ్రాల పంపిణీ సమయంలో మండపం వద్ద తొక్కిసలాట జరగకుండా ఆలయ నిర్వహకులు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆలయం ముఖ ద్వారం వద్ద గోదావరి నదిలో తెప్పోత్సవం నిర్వహించే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు.ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రిపురుషోత్తమాచార్యులు, ఆలయ చైర్మన్ రేవు బాలరాజు, ఎస్‌ఐ కె.నాగరాజు పాల్గొన్నారు.

రాముడు నడయాడిన నేల



ఈ దండకారణ్య ప్రాంతమంతా సీతారామచంద్రస్వామివారు నడయాడారు. పంచారామాలయాలు ఈ ప్రాంతానికే సొంతం. సీతారామచంద్రస్వామి జటాయువుకు పిండప్రదానం చేసిన అనంతరం,ఇక్కడ కొండపై తపస్సు చేశారు. ఇక్కడి నుంచే వానర సైన్యంతో రావణాసురుడిపై యుద్ధానికి వెళ్లారు.

– సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు .

ఇద్దరు విద్యార్థుల అదృశ్యంపై ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

చింతపల్లి రూరల్: మండలంలో లంబసింగి గిరిజన సంక్షేమ శాఖ బాలురు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఎస్ఐ అరుణ్ కిరణ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలో బౌడ గ్రామానికి చెందిన పాంగి సాయి, గానుగులపాడు గ్రామానికి చెందిన కిల్లో దినేష్ లంబసింగి గిరిజన సంక్షేమ శాఖ బాలురు ఆశ్రమ పాఠశాలలో 7 వ తరగతి చదువుతున్నారు. ఈ నెల 13 నుంచి వారిద్దరు కనిపించడం లేదని పాఠశాల వార్డెన్ సోమవారం తమకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆ ఇద్దరి విద్యార్థులకు సంబంధించి సమాచారం తెలిస్తే 9440904238, 9440904239 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.



తప్పిపోయిన విద్యార్థులు

నేటి నుంచి హైదరాబాద్‌కు మరో విమానం



గోపాలపట్నం: విశాఖ నుంచి హైదరాబాద్‌కు రాత్రిపూట మరో విమాన సర్వీసు మంగళవారం అందుబాటులోకి రానుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం హైదరాబాద్ నుంచి ప్రతీ రోజు రాత్రి 9.35 గంటలకు బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి 11 గంటలకు చేరుకుంటుంది. తిరిగి విశాఖ నుంచి రాత్రి 11.40 గంటలకు బయలుదేరి రాత్రి 1.50 గంటలకు చేరుకుంటుందని విమానాయాన సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

ఓర్వలేకనే ముఖ్యమంత్రిపై దాడి



ముట్టుజోరులో నిరసన తెలుపుతున్న సర్పంచ్ సాంబ, గిరిజనులు



కొత్తూరులో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వామి, తదితరులు

ముట్టుజోరులో నిరసన

హుకుంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని ముట్టుజోరు సర్పంచ్ సీదరి సాంబ, ఎంపీటీసీ సభ్యుడు వరదాని భీమలింగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ముట్టుజోరులో సర్పంచ్ ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న ఆదరణ, ఆయనపై చూపుతున్న అభిమానాన్ని చూసి ఓర్వలేకనే టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రాంబాబు, సత్యనారాయణ ,వైస్ సర్పంచ్ కిల్లో ఆనంద్ పాల్గొన్నారు.

అనంతగిరి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా మండలంలోని కొత్తూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ గంగులు, ఎంపీటీసీ బాటినాయుడు, సర్పంచ్ సన్యాసిరావు, జేసీఎస్ కన్వీనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం

- 1,767 గ్రామాల్లో నివారణ మందు తొలి విడత పిచికారీ
- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: జిల్లాలో మలేరియా నిర్మూలన లక్ష్యంగా వైద్యారోగ్యశాఖ, మలేరియా విభాగం అధికారులు పనిచేస్తున్నారని కలెక్టర్ విజయ సునీత వెల్లడించారు. సోమవారం ఆమె చింతలవీధిలో మలేరియా దోమల నివారణ మందు పిచికారీని ఆమె ప్రారంభించారు. పిచికారీ పనులను ఆమె కొంతసేపు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 307 గ్రామ సచివాలయాల్లో 1767 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించామన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన తొలివిడత దోమల నివారణ మందు(ఏసీఎం 5శాతం) పిచికారీని ఈనెల 30లోగా పూర్తి చేసేలా ఆదేశాలిచ్చామన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతీ నివాసం బయట, లోపల మందు పిచికారీ చేపట్టాలన్నారు. వైద్యులు, సిబ్బంది,మలేరియా విభాగం అధికారుల సమన్వయంతో సకాలంలో పిచికారీ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వీటికి స్థానికులు సహకరించాలని ఆమె కోరారు. జిల్లా మలేరియా విభాగం అధికారి టి.ఎస్.ఎస్.ప్రసాద్, డీపీవో సాధన తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణ మందు పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ విజయసునీత

జగనన్న సైనికుల్లా పనిచేస్తాం

- మూకుమ్మడి రాజీనామాలు చేసిన వలంటీర్ల వెల్లడి
- జిల్లావ్యాప్తంగా 317 మంది పత్రాలు అందజేత
- సీఎంపై దాడి చేయడం ఘోరం

చింతపల్లి రూరల్: రేపటి నుంచి జగనన్న సైనికుల్లా పనిచేసేందుకు తామంతా సర్వం సిద్ధమని వలంటీర్లు అన్నారు. మండలంలోని 17 పంచాయతీలకు సంబంధించి సుమారు 138 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ఎంపీడీవో వీరసాయిబాబు కు సోమవారం అందజేశారు. అనంతరం మండల వలంటీర్ల సంఘ అధ్యక్షుడు పరమేశ్వరరావు మాట్లాడుతూ జగనన్నపై జరిగిన రాయి దాడిని నిరసిస్తూ తాము రాజీనామా చేసినట్టు చెప్పారు. రాజీనామా చేసిన వలంటీర్లంతా నియోజకవర్గ పరిశీలకులు శ్రీకాంత్ రాజును కలిశారు. ఈ ఎన్నికల్లో అరకు ఎంపీగా తనూజారాణిని, పాడేరు ఎమ్మెల్యేగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇస్తామన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామ సచివాలయాలకు చెందిన 54 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేసి పత్రాలను కార్యదర్శులు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావుకు అందజేశారు. జడ్డంగి సచివాలయం నుంచి 18 మంది, చికిలింత నుంచి నలుగురు, వంచంగి నుంచి 12 మంది, వాతంగి నుంచి 7గురు, దూసరపాములో 7గురు, తంటికొండ నుంచి 6గురు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

కొయ్యూరు: మండలంలోని కంఠారం, కొమ్మిక, శరభన్నపాలెం, నడింపాలెం, చింతలపూడి గ్రామ సచివాలయాల పరిధిలో 45 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించి పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. ప్రతిపక్షాల విమర్శలకు మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.



రాజవొమ్మంగిలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న వలంటీర్లు



రాజీనామా అనంతరం వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు శ్రీకాంత్ రాజును కలిసిన వలంటీర్లు



కొయ్యూరులో రాజీనామా పత్రాలను చూపిస్తున్న వలంటీర్లు

పాడేరు : మండలంలో సుమారు 22 మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వంట్లమామిడిలో 9మంది, సలుగు 9మంది, పాడేరు మేజర్ పంచాయతీలో నలుగురు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు వారంతా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఇకపై వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పని చేస్తామని కొమ్ము సురేష్, కొమ్మ రాంబాబు తెలిపారు.

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీలో 15మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. సచివాలయ అధికారులకు అందజేశారు.

పెదబయలు: డలంలోని సీకరి, ఇంజరి, లింగేటి, జామిగుడ, గోమంగి, కుంచుర్ల పంచాయతీల పరిధిలోని 45 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేసి పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీవో నర్సింగరావుకు అందజేశారు. ప్రతిపక్షాల విమర్శలకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్టు వారు వెల్లడించారు. ఇకనుంచి జగనన్న సైనికుల్లా గ్రామాల్లో పనిచేస్తామని వనల్ల కరుణాకర్, బోనంగి వెంకటపడాల్ తెలిపారు. అనంతరం జైజగన్ అంటూ నినాదాలు చేశారు.



పెదబయలులో ఎంపిడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఓటుతోనే బుద్ధి చెప్పాలి



ప్రతిపక్షాల నేతలు, అభ్యర్థులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వలంటీర్ వ్యవస్థపై లేనిపోని విమర్శలు చేశారు. పేదలకు సేవలు అందకుండా అడ్డుపడ్డారు. దీనికి మూల్యం ఈ ఎన్నికల్లో చెల్లించక తప్పదు. ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారు.

– వనల్ల కరుణాకర్, సీకరి, పెదబయలు మండలం

సీఎంపై దాడి బాధాకరం



మేమే సిద్ధం బస్సు యాత్రలో జగనన్నపై రాయితో దాడి చేయడం చాలా బాధాకరం. ఆయనను ఎదుర్కొనలేక కూటమి నేతలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– కొట్టికి మహేశ్వరి, జామిగుడ,పెదబయలు మండలం

ప్రతి ఇంటా జగన్నినాదం



నాతవరం సభకు హాజరైన భారీ జనం, (ఇన్‌సెట్) నాతవరం సభలో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

- మన విజయాన్ని ఎవరూ ఆపలేరు
- సంక్షేమ లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి గుండెల్లో జగన్
- నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధి నాతవరం మండలంలో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట ఏర్పాటు చేసిన ప్రతీ పథకం జగన్ ఆలోచనలో భాగం అని తెలిపారు. విద్యా, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ అమలు చేస్తే, ఆ తర్వాత చంద్రబాబునాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. మరలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు చికిత్సల ఖర్చు పరిమితి పెంచారన్నారు. రాష్ట్రంలో 15 వేల గ్రామ సచివాలయాలు, 10 వేల ఆర్బీకేలు, 10 వేల హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సేవలందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో కూటమి పేరుతో వస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన ప్రతి ఇంటా జగన్నినాదం మార్మోగుతోందన్నారు. ప్రతి ఒక్కరి గుండెల్లో జగన్ ఉన్నంత కాలం వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.1,700 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామన్నారు. మరలా ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలిపిస్తే మరింత అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా అతిసామాన్య వ్యక్తి బూడి ముత్యాలనాయుడు కాగా, కూటమి నుంచి ఇతర జిల్లా నుంచి సంపన్న వ్యక్తిని దిగుమతి చేసుకున్నారని విమర్శించారు. ఈ ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు.

ఇది సామాన్యులకు, పెత్తందారులకు పోటీ

పార్లమెంట్ అభ్యర్థి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రెండు సార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా అవకాశం కల్పించారన్నారు. తనపై పోటీ చేసేందుకు ఈ ప్రాంతంలో ఎవరూ లేనట్లుగా ఎక్కడ నుంచో దిగుమతి చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నాతవరంలో ఎన్నికల ప్రచారం విజయోత్సవ ర్యాలీగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మంచి వ్యక్తిగా పేరున్న ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్‌ను మంచి మెజార్టీలో గెలిపించాలన్నారు.

దోపిడీ అయ్యన్నకు ఓటుతో బుద్ధి చెప్పాలి...

టీడీపీలో కార్యకర్తలను, నాయకులను నిరంతరం దూషించే అయ్యన్న ప్రజలకు ఏం మేలు చేశారో తెలపాలని ఎమ్మెల్యే గణేష్ డిమాండ్ చేశారు. అతని కుమారుడు విజయ్ గ్రామాల్లో తిరుగుతూ నోటికొచ్చినట్లు దూషిస్తున్నారన్నారు. ప్రతీ సారి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం చేయడం తప్ప ఏనాడూ సీటు పొందలేని దౌర్భాగ్యం దాపురించిందని ఎద్దేవా చేశారు. డబ్బులు కోసమే ఎంపీ సీటు తనదని ప్రచారం చేసి వచ్చిన వారి నుంచి ముడుపులు దండుకోవడం ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు. అవినీతి అయ్యన్నకు ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, పార్టీ సీనియర్ నాయకుడు బోళెం నర్సింహమూర్తి, డీసీసీబీ డైరెక్టర్ అంకంరెడ్డి పార్వతి, డాక్టరు లక్ష్మీకాంత్, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరావు, పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతరాజు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, నియోజవర్గ స్థాయి నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సాగుతున్న బైక్‌ర్యాలీ

ఉత్సాహంగా సాగిన బైక్ ర్యాలీ

ఇక్కడ ఎన్నికల ప్రచారానికి నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. తాండవ జంక్షన్ నుంచి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే గణేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. సుమారుగా ఏడు కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా ర్యాలీలో మహిళలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఐటీడీఏ పీవో కాపూరి చైతన్య

చింతూరు: రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కాపూరి చైతన్య అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని పీవో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆయన సూచించారు. శిక్షణలో భాగంగా సున్నితమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా పోలింగ్ రోజున ప్రశాంతంగా ఎన్నిక నిర్వహించే అస్కారముంటుందని పీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ నజీముల్లాషా తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

పశు బీమా అమలులో జిల్లాకు ప్రథమ స్థానం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో సోమవారం చింతపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాడేరు, రంపచోడవరం, అరకు డివిజన్లకు సంబంధించిన పశువైద్యాధికారులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లూరి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సీహెచ్. నర్సింహులు మాట్లాడుతూ పశు బీమా అమలులో అల్లూరి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పౌష్టికాహారం ఉత్పత్తిలో ప్రథమ స్థానం లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ పనిచేస్తోందన్నారు. పశువులకు వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కోళ్ల ఫాం, మేకలు, గొర్రెలు, డెయిరీలు నిర్వహణతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని, ఈ మేరకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని కోరారు. పశుసంవర్ధక శాఖ డీడీ అహ్మద్ షరీఫ్, ఏడీ చంద్రశేఖర్‌రావు తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నర్సింహులు

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

అరకులోయ రూరల్: పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపు లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు దాడులకు పాల్పడుతున్నాయని, ఇది హేయమైన చర్య అని, దీన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో టీడీపీ, పొత్తు పార్టీలకు గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు హయాంలో మన్య ప్రాంతంలో ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవన్నారు. మన్యప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకొని, మరింత సంక్షేమాభివృద్ధి సాధిద్దామని ఆయన పిలుపునిచ్చారు.



అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

19న అప్పన్న వార్షిక కల్యాణోత్సవం



సమావేశం నిర్వహిస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, ఈవో శ్రీనివాసమూర్తి తదితరులు

- పలు శాఖల అధికారులతో ఈవో సమీక్ష

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవాన్ని అన్ని శాఖల సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయా శాఖల అధికారులతో సోమవారం సింహగిరిపై ఉన్న కల్యాణ మండపంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రథోత్సవం, కల్యాణోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 19న రాత్రి 8.30 గంటల నుంచి రథోత్సవం, 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. భక్తుల కోసం మంచినీరు, మజ్జిగ సదుపాయం కల్పిస్తామన్నారు. రెండు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సింహగిరిపై అన్నదాన భవనంలో భక్తులకు ప్రత్యేకంగా భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలను ప్యాకెట్ల రూపంలో ప్రసాద విక్రయ శాల వద్ద ఉన్న కౌంటర్లలో అందిస్తామన్నారు. 19న సాయంత్రం మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. తిరిగి రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు స్వామి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఆ సమయంలో భక్తులకు ఉచిత దర్శనం ఉంటుందన్నారు. జీవీఎంసీ, దేవస్థానం సంయుక్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులతో కలిసి సింహగిరిపై ఏర్పాట్లను పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ-2 సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సీఐ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతపండుకు గిట్టుబాటు ధర

- ప్రకటించిన జీసీసీ
- పిక్కతో పండు కిలో రూ.32.40, పిక్కతీసిన పండు రూ.63కు కొనుగోలు
- ఇప్పటి వరకు 64 టన్నుల సేకరణ

సాక్షి,పాడేరు: గిరిజన సహకార సంస్థ భారీగా చింత పండు కొనుగోలుకు చర్యలు చేపట్టింది. పిక్కతో పండును కిలో రూ.32.40, పిక్క తీసిన పండు కిలో రూ.63కు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. గతేడాది పిక్కతో 607.09 మెట్రిక్ టన్నులు, పిక్క తీసిన పండు 65.54 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. ప్రస్తుత సీజన్‌లో వారపు సంతల్లో ఇప్పటివరకు గిరిజనుల నుంచి 64 టన్నుల మేర చింతపండును జీసీసీ కొనుగోలు చేసింది. ఈ ఏడాది కూడా గతేడాది మాదిరిగానే కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దళారులు కూడా జీసీసీకి పోటీగా నాణ్యతను బట్టి కిలో రూ.35 నుంచి రూ.40కు కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జీసీసీ జీఎం (మార్కెటింగ్) సురేంద్రకుమార్ మాట్లాడుతూ గిరిజనులు పిక్క తీసిన చింతపండును విక్రయిస్తే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. చింతపండుకు సంబంధించి గిరిజనులకు కచ్చితమైన తూకంతోపాటు, గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు.



పాడేరు మార్కెట్‌కు చింతపండును మోసుకు వస్తున్న గిరిజన మహిళలు

రామాలయంలో భక్తిశ్రద్ధలతో హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామివారి సీతారాముల ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హోమంలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

- ఏఎస్పీ ధీరజ్



మాట్లాడుతున్న ఏఎస్పీ ధీరజ్

ముంచంగిపుట్టు: రానున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఏఎస్పీ ధీరజ్ అన్నారు.మండల కేంద్రంలో స్థానిక పోలీసు స్టేషన్‌ను ఏఎస్పీ ధీరజ్ సోమవారం సందర్శించారు.ఎన్నికల దృష్ట్యా మారుమూల పంచాయతీల పరిస్థితిలపై ఎస్ఐ రవీంద్రను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు.అనంతరం విలేకరులతో ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అన్ని ప్రాంతాలతో పాటు మారుమూల గిరిజనులు కూడా స్వచ్ఛందంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. భూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో ఈసారి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, గతంలో భూసిపుట్టు పంచాయతీ ప్రజలు మద్దులబంద గ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు అవస్థలు అవసరం లేదన్నారు. బుంగాపుట్టు, రంగబయలు పంచాయతీల గిరిజనులు ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లక్ష్మీపురం, వనుగుమ్మ పంచాయతీ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. సరిహద్దు గ్రామాల్లో కొన్ని రోజులుగా జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, అనుమానితులుగా గుర్తిస్తే పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు. మండల కేంద్రాల్లో రాత్రిపూట తనిఖీలు సైతం ముమ్మరం చేశామని, యువత రాత్రివేళల్లో రక్షణగా కాపలాకు ముందుకు వస్తే పోలీసుశాఖ ద్వారా పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆయన వెంట జి.మాడుగుల సీఐ రమేష్ తదతరులున్నారు.

వ్యాన్ బోల్తా- ఒకరి మృతి

సీలేరు: గూడెం కొత్త వీధి మండలం సప్పర్ల ప్రాంతం నుంచి సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి లోయలో ప డడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమ వారం ఆకులూరిపేట గ్రామం సమీపంలో ఘాట్‌రోడ్‌లో సిమెంట్ లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి 10 అడుగుల దిగువున ఉన్న లోయలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ వెనుక భాగంలో ఉన్న పనసల బంధు గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు, వంతల రమేష్, పాంగి బాబి, వంతల రవి, డ్రైవర్ గంగుల నాయుడుకి స్వల్ప గాయాలు కాగా వంతల సన్యాసిరావుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలో సప్పర్ల పీహెచ్‌సీకి తరలించారు. ఈ ప్రమాదంలో వంతల సన్యాసిరావు పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

టీడీపీ విందు రాజకీయం

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని భావిస్తున్న టీడీపీ అభ్యర్థులు అడ్డదారులూ తొక్కుతున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు విభజించు.. ఆతిథ్యమిచ్చు.. అనే సూత్రాన్ని అవలంబిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా సహపంక్తి భోజనాలతో ఎరవేస్తున్నారు. ఆత్మీయ సమావేశాల పేరుతో ప్రత్యేక కూపన్లు పంపిణీ చేస్తూ.. డబ్బులు, గిఫ్టులు అందజేస్తూ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలో అయితే ప్రతి వీధినీ.. ఏకంగా మందుబాబులకు అడ్డాగా మార్చేస్తున్నారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది.

- సహపంక్తి భోజనాలతో టీడీపీ నేతల వల
- తమ పరిధిలో సామాజికవర్గాల వారీగా ఆహ్వానం
- ఆత్మీయ సమావేశం పేరుతో ప్రత్యేక కూపన్ల పంపిణీ
- తూర్పులో మందు పార్టీలు నిర్వహిస్తున్న వెలగపూడి
- బూత్‌లో ఓట్ల మేరకు గంటా బేరసారాలు



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలకు ఓటింగ్ దగ్గరపడుతున్నకొద్దీ టీడీపీ అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ప్రచారాల్లో పార్టీకి పెద్దగా ఆదరణ లేకపోవడంతో బెంగ ఏర్పడుతోంది. దీంతో ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం ఆయా నియోజకవర్గాల్లో స్థానికంగా ఉన్న సామాజికవర్గాల పెద్దలను పిలిచి తియ్యటి మాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఆయా సామాజికవర్గాల వారీగా ఆత్మీయ విందుల పేరుతో వలవేస్తున్నారు. ఇంటికి వెళ్లే సమయంలో ప్రత్యేక కూపన్లు ఇస్తున్నారు. వీటితో నిత్యావసరాలు, మందు, ఫుడ్ కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల్ని ఉల్లంఘిస్తూ టీడీపీ అభ్యర్థులు తమ అనుచరుల నివాసాలు, రిసార్టుల్లో ఈ తరహా పార్టీలు నిర్వహిస్తున్నారు.

పోలింగ్ బూత్ వారీగా..

భీమిలి, విశాఖ తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు ఈ తరహాలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఒకే చోటు ఎక్కువ మంది కూడితే ఎన్నికల కమిషన్‌కు అనుమానం వస్తుందని భావించి, పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఓటు ఉండి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి బంధువుల ఓట్లు కొనుగోలుకూ బేరసారాలు మొదలు పెడుతున్నారు.

గంటాది అదే పంథా

భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు విశాఖ ఉత్తర నుంచి గతంలో పోటీ చేసినప్పుడు సైతం కులసంఘాలతో తరచూ సమావేశాలు నిర్వహించేవారు. ఇప్పుడు అదే పంథా కొనసాగిస్తూ గెలుపు కోసం ఎత్తుగడలు వేస్తున్నారు.

అలాగే సామాజికవర్గాల వారీగా ఆ బూత్‌లో ఉన్న ఓట్ల మేరకు బేరసారాలు సాగిస్తున్నారు. విందు రాజకీయాల్లో ఆరితేరిన ఆయన బిర్యానీలు, స్వీట్ ప్యాకెట్లు, కూపన్లు అందిస్తూ ఓటర్లకు గాలం వేస్తున్నారు. ఆదివారం రాత్రి కొమ్మాది సమీపంలోని అన్నంరాజు లే అవుట్ వద్ద పలువురికి మందు, విందు ఏర్పాటు చేశారు.

తూర్పులో మద్యం కూపన్లు

విశాఖను మద్యం మత్తులో దింపిన వెలగపూడి.. ఈ ఎన్నికల్లోనూ తన సిండికేట్ వ్యాపారమైన మద్యాన్నే నమ్ముకుంటున్నారు. మందుబాబులు ఎవరున్నారో.. తన అనుచరుల ద్వారా తెలుసుకొని.. ప్రతి రోజూ తనకు చెందిన బార్ల పేరుతో కూపన్లు అందిస్తున్నారు. ఇందుకోసం తన బార్లలో ప్రత్యేకంగా మద్యం నిల్వలు పెట్టుకున్నట్లు సమాచారం. బిర్యానీ, మందు బాటిల్ అందజేస్తూ ఓటర్లను వెలగపూడి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఈసారి తూర్పులో ఎదురుగాలి తప్పదని భావించిన వెలగపూడి.. ప్రతి వీధినీ మద్యం మత్తులో జోగేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. ప్రచారంలో తనతో పాటు వచ్చిన వారికి తన అనుచరుల సహాయంతో ఆయా బార్లు, మద్యం దుకాణాల వద్దకు తీసుకెళ్లి.. ఎవరికి ఎంత మేర కావాలో అందజేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్న టీడీపీ అభ్యర్థులను జనం ఛీదరించుకుంటున్నారు.